# డాక్టర్ అప్పనబోయిన చక్రపాణి

డాక్టర్ అప్పనబోయిన చక్రపాణి 2007 వ సంవత్సరం ఏప్రిల్ 3 వ తేదీన శాసన పరిషత్తు అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైనారు.

డాక్టర్ చక్రపాణి శ్రీ ఎ. నారాయణ, శ్రీమతి సుబ్బమ్మ దంపతులకు కర్నూలు జిల్లాలోని హుస్సేనాపురంలో జన్మించారు. న్యాయశాస్త్రంలో పి.హెచ్.డి. పట్టాను పొందారు.

వీరు విద్యార్థి దశనుండి రాజకీయాలలో చురుకుగా పాల్గొన్నారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యునిగా, ఎ.పి.సి.సి. ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షునిగా, ఎ.పి.సి.సి. మాన్యుఫెస్టో కమిటీ అధ్యక్షులుగా పనిచేసారు. 1973 వ సంవత్సరములో పి.సి.సి. రద్దు కాబడినప్పుడు ఆ కమిటీ స్థానంలో ఏర్పడిన హైపవర్ కమిటీకి వీరు కన్వీనర్‌గా వ్యవహరించారు.

వీరు 1976 వ సంవత్సరం జూలై 1 వ తేదీ నుండి 1982 వ సంవత్సరం జూన్ 30 వ తేదీ వరకు మరియు 1982 వ సంవత్సరం జూలై 1 వ తేదీ నుండి 1985 సంవత్సరం మే 31 వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ శాసన పరిషత్తుకు నామినేటెడ్ సభ్యులుగా ఉన్నారు. తిరిగి 2007 వ సంవత్సరంలో కూడా గవర్నరు ద్వారా శాసన పరిషత్తుకు మూడవసారి నామినేట్ చేయబడినారు. వీరు 1983వ సంవత్సరం సెప్టెంబరు 19 వ తేదీన శాసన పరిషత్తుకు ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికై 1985 వ సంవత్సరం మే 31 వ తేదీ వరకు ఆ పదవిలో కొనసాగారు.

జీవిత భీమా సంస్థ ఋణముతో హరిజనుల కోసం నిర్మించిన ఇళ్ళు నివాసయోగ్యంగా లేకుండుట పై 1977 వ సంవత్సరంలో నియమించిన సభా సంఘానికి, ఇంటర్‌మీడియెట్ విద్యామండలి నిర్వహించిన పరీక్షలలో కొన్ని సమాధాన పత్రాలను అనధికారికంగా పునర్మూల్యాంకనం చేసిన విషయాన్ని పరిశీలించడానికి 1978 వ సంవత్సరంలో నియమించిన సభాసంఘానికి వీరు అధ్యక్షులుగా పనిచేసారు.

డా. చక్రపాణి 1978-79 సంవత్సరముల మధ్యకాలంలో నిబంధనల సమితి, 1980-81 సంవత్సరముల మధ్యకాలంలో విశేషాధికారాల సమితిలో సభ్యులుగా

పనిచేసారు. వీరు 1979-80 సంవత్సరముల మధ్యకాలంలో ప్రభుత్వ చీఫ్ విప్‌గా పనిచేసారు.

వీరు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సహకార ఉద్యమంలో చురుకైన పాత్ర నిర్వహించారు. వీరు చేపట్టిన అనేక సహకార సంస్థలు ఇప్పటికీ సజీవంగా తమ పాత్ర నిర్వహిస్తున్నాయి. బలహీన వర్గాలు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం పలు ప్రాథమిక సహకార సంఘాలను స్థాపించి వాటి అభ్యున్నతికి కృషి చేసారు.

రాష్ట్ర గ్రంథాలయోద్యమంలో వీరు ప్రముఖ పాత్ర నిర్వహించారు. అనేక గ్రంథాలయాలకు సహాయ సహాయ సహకారాలను అందించి వాటి అభివృద్ధికై పాటు పడ్డారు. స్వర్గీయ దామోదరం సంజీవయ్య అంతే వాసిగా జీవితం ప్రారంభించిన వీరు దామోదరం సంజీవయ్య పేరిట గ్రంథాలయం స్థాపించి ఆ కమిటీకి గౌరవ అధ్యక్షులుగా పనిచేసారు.

అనేక జాతీయ, రాష్ట్ర స్థాయి సదస్సులు, సమావేశాలు, వర్క్ షాపులలో పాల్గొన్నారు. జాతీయ సమగ్రత, లౌకిక వాదం, ఓ.బి.సి. లకు రిజర్వేషన్స్ వంటి సమకాలీన సమస్యలపై దేశంలో వివిధ ప్రాంతాలలో జరిగిన పలు సదస్సులకు అధ్యక్షత వహించారు.

డా. చక్రపాణి విద్యార్థి దశలో ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజి విద్యార్థి యూనియన్‌కు అధ్యక్షులుగా పనిచేసారు. తరువాత ఉస్మానియా విశ్వ విద్యాలయం సెనేట్ సభ్యులుగా, ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల ఫెడరేషన్ అధ్యక్షులుగా, సెంట్రల్ సాన్‌స్క్రిట్ విద్యాపీఠ్ (తిరుపతి) సభ్యులుగా పనిచేసారు.

వీరు హైదరాబాదు నుండి వెలువడిన "ఆంధ్ర జనతా" అనే తెలుగు దిన పత్రికకు సంపాదకులుగా పనిచేసారు. వివిధ ప్రజా సమస్యలపై పలు దినపత్రికలలో అనేక వ్యాసాలు వ్రాసారు.

డా. చక్రపాణిగారు "సెకండ్ ఛాంబర్ ఆఫ్ లెజిస్లేచర్ - ఎ మస్ట్, లీగల్ ప్రొఫెషన్ అండ్ ఎ సింగిల్ లాయర్", "సోనియాగాంధీ-ఫ్యూచర్ ఆఫ్ ఇండియా",

"యాంటీ అరాక్ మూమెంట్ ఇన్ ఎ.పి." మరియు "ప్రాసెస్ ఆఫ్ ఎమెండ్‌మెంట్స్ టు ది ఇండియన్ కాన్‌స్టిట్యూషన్" అనే పుస్తకాలను రచించారు.